సాక్షి
కర్నూలు
శుక్రవారం । 5 । జూలై । 2024



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై గురువారం నెల్లూరుకు చెందిన త్రిపుర నిఖిత వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



బ్యాళ్ల పంపిణీ తూచ్!

టీడీపీ ప్రభుత్వం మొదటి నెలలోనే రేషన్ పంపిణీలో సరుకులకు కోత పెట్టింది. కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. బ్యాళ్లు, పంచదారల కేటాయింపులే జరగలేదు. 8లో▸



ఆనందం.. ఆహ్లాదం

పచ్చర్ల వద్ద ఉన్న ఎకో టూరిజం పర్యాటకులను ఆకర్షిస్తోంది. కాటేజీ వసతులు ఉండటంతో అంతర్రాష్ట్ర పర్యాటకులు ఇక్కడే విడిది చేసి అటవీ అందాలను ఆస్వాదిస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక యాప్

- వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): తాను బాపట్ల కలెక్టర్‌గా ఉన్న సమయంలో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు యాప్ రూపొందించి అమలు చేశామని, ఇక్కడ కూడా అదే విధంగా చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వైద్య, ఆరోగ్యశాఖ చేపడుతున్న కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక యాప్‌లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు లాగిన్ అయి పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను వెంటనే తెప్పించి జిల్లాకు అనుగుణంగా రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో చేరిన రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. అతిసార, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాధవి, జిల్లా లెప్రసీ ప్రాజెక్టు అధికారి డాక్టర్ భాస్కర్, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ హేమలత పాల్గొన్నారు.

వైభవంగా విజయీంద్ర తీర్థుల ఆరాధన



విజయీంద్ర తీర్థుల బృందావనానికి హారతులు పడుతున్న పీఠాధిపతులు


మంత్రాలయం: తమిళనాడులోని కుంభకోణంలో శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతి విజయీంద్ర తీర్థుల ఉత్తరాధన వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, కుంభకోణ పీఠాధిపతి విశ్వవల్లభ తీర్థులు నేతృత్వంలో వేడుకలు నిర్వహించారు. విజయీంద్ర తీర్థుల మూల బృందవనానికి పంచామృతాభిషేకం, పాలాభిషేకం, పుష్పార్చనలు నిర్వహించి హారతులు పట్టారు. శాస్త్రోక్తంగా జరిగిన వేడుకలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

'ఉపాధి'లో 78 మందికి షోకాజ్ నోటీసులు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద లక్ష్యాలను సాధించడంలో అలసత్వం వహించిన 78 మంది ఉపాధి అధికారులు, సిబ్బందికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎమ్మిగనూరు, కర్నూలు, ఆదోని అసిస్టెంటు ప్రాజెక్టు డైరెక్టర్లు(ఏపీడీ), 10 మండలాల ఏపీవోలు, ఈసీలు, దాదాపు అన్ని మండలాల్లోని పలువురు సాంకేతిక సహాయకులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించడం, లేబర్ రిపోర్టింగ్ తక్కువగా ఉండటం, పండ్లతోటల అభివృద్ధికి ఆసక్తి ఉన్న రైతులను గుర్తించడంలో అలసత్వం వహించడం, తదితర కారణాలతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

బదిలీలు తప్పవని.. వసూళ్లు తప్పేంటని!

గాడితప్పిన పోలీసులు
- అధిక శాతం మొక్కుబడి విధులకే పరిమితం
- స్టేషన్లలో మితిమీరిన అవినీతి
- చెలరేగిపోతున్న క్రైం పార్టీ సిబ్బంది
- ఎస్‌హెచ్‌ఓల కనుసన్నల్లో వ్యవహారం
- మౌనం దాల్చిన స్పెషల్ బ్రాంచ్



కర్నూలు: ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం జిల్లా పోలీసు శాఖలో స్తబ్దత నెలకొంది. క్షేత్రస్థాయిలో సీఐలు, ఎస్‌ఐలు విధి నిర్వహణలో పెద్దగా ప్రభావం చూపని పరిస్థితి. ఎలాగూ బదిలీ తప్పదని భావిస్తున్న కొందరు మొక్కుబడి విధులకే పరిమితం అయ్యారు. ఎన్నికలకు ముందు జిల్లా నుంచి 28 మంది అధికారులు పొరుగు జిల్లాలకు బదిలీపై వెళ్లగా.. అదే స్థాయి అధికారులు పొరుగు జిల్లాల నుంచి జిల్లాకు బదిలీపై వచ్చారు. వీరిలో కొందరికి మంచి పోస్టింగులు దక్కాయి. కూటమి ప్రభుత్వం గద్దె నెక్కాక పోలీసుల బదిలీలు తప్పవన్న సంకేతాలు వెలువడ్డాయి. దీంతో ఉన్న కొద్ది రోజుల్లో అందిన కాడికి దండుకోవాలనే యోచనలో కొందరు అధికారులు వసూళ్ల పర్వానికి తెర తీసినట్లు చర్చ జరుగుతోంది.

పేరుకే ఆదర్శ స్టేషన్..

కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని ఓ కీలకమైన పోలీస్‌స్టేషన్‌లో పరిస్థితి పూర్తిగా గాడి తప్పింది. సిబ్బంది గ్రూపులుగా విడిపోయి ఒకరిపై మరొకరు దుష్ప్రచారం చేసుకునే స్థాయి వరకు వెళ్లింది. ఆ స్టేషన్‌లో సుమారు 8 మంది సిబ్బంది క్రైం పార్టీ విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఇసుక, ఎర్రమట్టి, గ్రావెల్ రవాణాతో పాటు అసాంఘిక శక్తులతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సెటిల్‌మెంట్లు, సివిల్ పంచాయతీలు చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నప్పటికీ 'ఎస్‌హెచ్‌ఓ' ఎందుకు మౌనం వహిస్తున్నారోననే చర్చ కొనసాగుతోంది.

- ఓ హెడ్ కానిస్టేబుల్ రౌడీషీటర్లతో అంటకాగుతున్నారు. ఈయన నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నప్పుడు ఉన్నతాధికారులకు పలు ఫిర్యాదులు అందడంతో ఆలూరు నియోజకవర్గ పరిధిలోని ఓ స్టేషన్‌కు బదిలీ చేశారు. అయితే తక్కువ వ్యవధిలోనే అటాచ్‌మెంట్ పేరుతో వచ్చి వసూళ్లే దినచర్యగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- ఇక గూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఉండాల్సిన ఓ ఏఎస్‌ఐ కూడా అటాచ్ విధుల పేరుతో ఇక్కడ మకాం వేశారు.
- మరో కానిస్టేబుల్ నాలుగేళ్లుగా ఇక్కడే పని చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు.
- విజిలెన్స్ విభాగం నుంచి ఓ కానిస్టేబుల్ కూడా ఇక్కడికి బదిలీపై వచ్చారు.
- అలాగే మిలిటరీ నుంచి ఓ కానిస్టేబుల్ అటాచ్ విధుల కింద ఇక్కడికి చేరుకున్నారు. 2018 నుంచి ఆ కానిస్టేబుల్ ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు.

టిప్పర్‌కు రూ.20వేలు.. ట్రాక్టర్‌కు రూ.15వేలు

ఇసుక, గ్రావెల్, ఎర్రమట్టి, బండలు, కంకర లారీలు ఏవి కనిపించినా స్టేషన్‌కు పట్టుకొచ్చి మామూళ్లు వసూలు చేసి వదిలేస్తున్నట్లు సహోద్యోగులే చర్చించుకుంటున్నారు. స్టేషన్ పరిధిలో ఇసుక టిప్పర్లు 50 పైగా ఉన్నాయి. ఒక్కొక్క టిప్పర్ నుంచి నెలకు రూ.20 వేలు మామూళ్ల వసూలు చేస్తున్నారు. అలాగే వందకు పైగా ట్రాక్టర్లు ఉన్నాయి. అక్రమ రవాణా పేరుతో ట్రాక్టర్ల యజమానుల నుంచి నెలకు రూ.15 వేలు వసూలు గుంజుతున్నారు. కర్నూలు రూరల్ మండల పరిధిలో సుమారు 50 పైగా ట్రాక్టర్లు ఉన్నాయి. తుంగభద్ర నది నుంచి ఇసుకను తరలించేందుకు అందరూ కలిసి నెలకు రూ.50 వేలు మామూళ్లు ముట్టజెప్పుతున్నట్లు చర్చ జరుగుతోంది.

పంపకాల విషయమై ఓ స్టేషన్‌లో గొడవ

ఆర్థిక లావాదేవీల విషయంలో ఓ స్టేషన్‌లో పని చేసే క్రైం పార్టీ సిబ్బంది స్టేషన్‌లోనే వాదించుకోవడం చర్చనీయాంశంగా మారింది. కొన్ని స్టేషన్లలో ఎస్‌హెచ్‌ఓలు చేతికి మట్టి అంటకుండా క్రైం పార్టీ సిబ్బందిని అడ్డం పెట్టుకుని వసూళ్లకు పాల్పడుతున్నారు. కోడుమూరు మండలం గోరంట్ల సమీపంలోని హంద్రీ నది నుంచి ఓ టీడీపీ నాయకుడు ట్రాక్టర్ల ద్వారా పెద్ద ఎత్తున ఇసుక తరలించి రామకృష్ణాపురంలో డంప్ చేసి వ్యాపారం సాగిస్తున్నాడు. డోన్, కృష్ణగిరి, బేతంచెర్ల ప్రాంతాలకు ఇసుకను సరఫరా చేసి ఒక్కొక్క ట్రాక్టర్ రూ.10 వేల దాకా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఇందుకోసం పోలీసులకు కూడా భారీగా మామూళ్లు ముడుతున్నట్లు చర్చ జరుగుతోంది. కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని తుంగభద్ర నది తీరంలో ఉన్న ఓ పోలీస్‌స్టేషన్ అధికారికి వారానికి రూ.లక్ష చొప్పున ట్రాక్టర్ యజమానులు వసూలు చేసి ముట్టజెప్పుతున్నట్లు సమాచారం.

నిస్తేజంగా స్పెషల్ బ్రాంచ్

పోలీస్ 'బాస్' కళ్లు, చెవులుగా ఉండాల్సిన స్పెషల్ బ్రాంచ్ కొంతకాలంగా నిస్తేజంగా మారింది. రోజువారీ వ్యవహారాలు, స్టేషన్లలో జరిగే తతంగాలపై నిఘా పెట్టి 'బాస్'కు ఎప్పటికప్పుడు నివేదించడం ఈ విభాగం బాధ్యత. ఇంతటి కీలకమైన విభాగం సమాచార సేకరణ, నిఘాలో తీవ్రంగా విఫలమవుతోందనే చర్చ జరుగుతోంది. సమాచారం కోసం ఇతరులపై ఎక్కువగా ఆధారపడటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. మూడో పక్షం నుంచి బాస్‌కు ఫిర్యాదులు వస్తే తప్ప సమాచారం ఉండటం లేదనే అభిప్రాయం ఉంది. కొంతమంది ఎస్‌బీ సిబ్బంది స్టేషన్లలో పనిచేస్తున్న క్రైం పార్టీ సిబ్బందితో చేతులు కలిపి సమాచారాన్ని తొక్కి పెడుతున్నట్లు తెలుస్తోంది.

క్రైం పార్టీకి 'వసూళ్లే' దినచర్య

పాణ్యం నియోజకవర్గ పరిధిలోని మరో స్టేషన్ పరిధిలో ఐదుగురు క్రైం పార్టీ సిబ్బంది వసూళ్లే దినచర్యగా పనిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పెబ్బేరు సంత నుంచి ప్రతి వారం కేరళ, తమిళనాడుకు పశువుల లారీలు వెళ్తుంటాయి. వాటి నుంచి నెలకు రూ.30 వేలు స్టేషన్ మామూలు కింద వసూలు చేస్తున్నారు. పంచలింగాల, తాండ్రపాడు, సింగవరం, మునగాలపాడు ప్రాంతాల నుంచి టిప్పర్లు నందికొట్కూరు, ఆత్మకూరు ప్రాంతాలకు ఇసుకను తరలిస్తుంటాయి. రాత్రివేళల్లో క్రైం పార్టీ సిబ్బంది వాటిని పట్టుకుని బెదిరించి ఒక్కొక్క టిప్పర్ నుంచి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఫోన్‌పే ద్వారా అనుకూలమైన వ్యాపారస్తులకు డబ్బు వేయించుకుని వెంటనే నగదుగా మార్చుకుని అధికారికి ముట్టజెప్పుతున్నట్లు సమాచారం. స్టేషన్ పరిధిలో సబ్సిడీ బియ్యం నిల్వ కేంద్రాలు పలు చోట్ల ఉన్నాయి. ఇద్దరు దళారుల నుంచి కూడా నెల మామూళ్లు వసూలు చేస్తున్నారు. లారీల కొద్దీ సబ్సిడీ బియ్యాన్ని అలంపూరు వద్ద నున్న ఓ రైస్ మిల్లుకు తరలించి సన్నబియ్యంగా మార్చి విక్రయాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటుండటంతో అధికారులతో మాట్లాడి నెల మామూళ్లకు తెగబడ్డారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో అన్ని విద్యాసంస్థలు గురువారం బంద్‌ను పాటించాయి. విద్యార్థి సంఘాల నాయకులు కర్నూలులోని గాయత్రీ ఎస్టేట్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాకార్యదర్శి అబ్దుల్లా, ఏఐఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సాబీర్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, జిల్లా నాయకులు తిరుమలేష్ మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన నీట్‌ను రద్దు చేసి, మళ్లీ పరీక్ష నిర్వహించాలన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్‌లో నీట్‌పై చర్చకు పట్టుబడుతుంటే బీజేపీ మాత్రం అంగీకరించడంలేదన్నారు. పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే దేశవ్యాప్త పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి సాయి, నాయకుడు అమర్, ఏఐఎస్‌ఎఫ్ నగర నాయకులు శరత్, అశోక్ పాల్గొన్నారు.

పండ్లతోటల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- జిల్లా స్థాయి సమావేశంలో డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): పండ్ల తోటల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఆదేశించారు. కర్నూలు శివారులోని డీసీబీసీలో ఏపీడీలు, ఏపీవోలు, టీఏ, ఈసీలతో గురువారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది జిల్లాలో 7430 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధి చేయాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు పురోగతి తక్కువగా ఉందన్నారు. జిల్లాలో 2వ940 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధికి పరిపాలనా అనుమతులు ఇచ్చారని, వెంటనే పిట్టింగ్ పనులు చేపట్టాలన్నారు. వర్షాలు పడుతున్నందున పండ్ల మొక్కలు నాటించడంపై దృష్టి సారించాలని సూచించారు. పది మండలాల్లో ఉపాధి పనులకు లేబర్ రిపోర్టు 60 శాతం కంటే తక్కువగా ఉందని, ఈ మండలాల్లో విరివిగా ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. ఉపాధి పనుల కింద భూగర్భ జలాల అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏపీడీలు పద్మావతి, లక్ష్మన్న, ఫక్కీరప్ప, అల్లీపీర, ప్లాంటేషన్ మేనేజర్ నందకిశోర్, కోర్స్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం



అల్లూరి సీతారామరాజుకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, చిత్రంలో జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): అల్లూరి సీతారామరాజు పోరాటం యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్ర పటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఓ మహోజ్వల శక్తి అని, ఆయన జరిపిన పోరాటం చిరస్మరణీయమన్నారు. అడవిలో ఉండే ఉత్పత్తులు సేకరించి అమ్ముకునే వారిపై దమనకాండ చేస్తుండగా బ్రిటీషు వారిపై వివిధ రకాలుగా పోరాడి వారికి విముక్తి కల్పించిన వ్యక్తి అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య , డీఆర్వో కె.మధుసూదన్‌రావు, గిరిజన, సాంఘిక సంక్షేమ అధికారి రంగలక్ష్మీదేవి, డీపీఓ నాగరాజునాయుడు, కర్నూలు ఆర్‌డీఓ శేషిరెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య.. ఉజ్వల భవిత

- డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు
- ఈనెల 10వ తేదీ వరకు అవకాశం
- ఆర్‌యూ పరిధిలో 88 కళాశాలల్లో అందుబాటులో 7,775 సీట్లు
- 22 నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభం

కర్నూలు కల్చరల్: విద్యార్థుల ఎదురు చూపులకు తెరపడింది. ఇంటర్ ఉత్తీర్ణులై డిగ్రీ ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థుల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలోని పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు, ఆదోని, డోన్, కోవెలకుంట్ల, నందికొట్కూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, పాణ్యం, ఎర్రగుంట్ల, శ్రీశైలం, ఆత్మకూరులలో డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో సైన్స్, ఆర్ట్స్, కామర్స్, ఒకేషనల్ కోర్సుల్లో సుమారు 2,000 వరకు సీట్ల భర్తీకి అవకాశం ఉంది. నంద్యాల, పత్తికొండ, డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఎన్‌సీసీ అందుబాటులో ఉంది.



కోవెలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కళాశాలల వివరాలు

యాజమాన్యం	కళాశాల సంఖ్య	కోర్సుల సంఖ్య	ఇన్‌టేక్ సీట్ల వివరాలు (సుమారు)
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	14	42	2000
ఎయిడెడ్ కళాశాలలు	6	32	3435
ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు	68	25	2340
మొత్తం	88	99	7775

మధ్యలో చదువు మానేసినా...

విద్యార్థులు డిగ్రీ ఫస్టియర్ చదివి మానేసినప్పటికీ సర్టిఫికెట్ కోర్సు పేరుతో సర్టిఫికెట్ అందజేస్తారు. రెండేళ్లు అయితే డిప్లొమా సర్టిఫికెట్, మూడేళ్లు అయితే డిగ్రీ సర్టిఫికెట్, నాలుగేళ్లు చదివితే డిగ్రీ ఆనర్స్ సర్టిఫికెట్‌ను అందిస్తారు. విద్యార్థి డిగ్రీ నాలుగేళ్లలో ఎప్పుడైనా మధ్యలో చదువు మానేసే వెసులుబాటు ఉంది. దానికి అనుగుణంగానే సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. ఫస్టియర్ నుంచి నాలుగేళ్ల లోపు ఏ దశలో చదువు మానేసినా, ఏడేళ్ల లోపు తిరిగి ప్రవేశం పొంది విద్యాభ్యాసం కొనసాగించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. డిగ్రీ విద్యా విధానంలో ప్రవేశపెట్టిన నూతన సింగిల్ మేజర్ ఆనర్స్ డిగ్రీ పద్ధతిపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గత విద్యాసంవత్సరం నుంచే నూతన విద్యా విధానం అమలవుతోంది.

షెడ్యూల్ ఇలా ...

- ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ 2వ తేదీ మొదలైంది.
- ఈనెల 10వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు స్పెషల్ కేటగిరీ వెరిఫికేషన్ జరుగుతోంది.
- ఫిజికల్లీ చాలెంజ్‌డ్/సీఏపీ/ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్/ఎన్‌సీసీ/గేమ్స్ అండ్ స్పోర్ట్స్ వంటి స్పెషల్ కేటగిరీ వెరిఫికేషన్లు ఆయా యూనివర్సిటీలలో ప్రాంతాల వారీగా నిర్వహిస్తారు.
- 5వ తేదీన ఓపెనింగ్ ఆఫ్ హెచ్‌ఎల్‌సీ ఫర్ వెరిఫికేషన్ ఆఫ్ సర్టిఫికెట్స్ ఉంటుంది.
- కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ, నంద్యాల పీఎస్‌సీ అండ్ కేవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు.
- కోర్సులను ఎంపిక చేసుకోవడం కోసం ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు.
- ఈ నెల 19వ తేదీన సీట్లు కేటాయింపు జరుగుతుంది.
- సీట్ అలాట్ అయిన విద్యార్థులు ఎంపికైన కళాశాలల్లో ఈనెల 20 నుంచి 22వ తేదీలోగా రిపోర్ట్ చేయాలి.
- ఈ నెల 22 నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి.



దోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సీట్ల కేటాయింపు ఇలా....

డిగ్రీ కోర్సుల్లో 50 శాతం రిజర్వేషన్లు తప్పనిసరి చేశారు. ఇంటర్మీడియట్‌లో కామర్స్ ఒక సబ్జెక్టుగా చదివిన వారికి బీకాం కోర్సుల్లో 60 శాతం సీట్లు కేటాయిస్తారు. ఆర్ట్స్, హ్యూమానిటీస్‌లో ఇంటర్ పూర్తి చేసినవారికి బీఏలో 50 శాతం సీట్లు కేటాయిస్తారు. తక్కిన 50 శాతం ఇంటర్‌లో సైన్స్ గ్రూపు పూర్తి చేసినవారికి కేటాయిస్తారు. విద్యార్థులు apsche. gov. in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. దగ్గర్లో ఉన్న డిగ్రీ కళాశాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సాధారణ కోర్సులకు రూ.3 వేల వరకు, కంప్యూటర్ కోర్సులకు రూ.8 నుంచి రూ.10 వేల వరకు కోర్సును బట్టి ఫీజు ఉంటుంది.

ఉర్దూ యూనివర్సిటీలో ..

డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ కోర్సు మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఓఏఎండీసీ పోర్టల్ ద్వారా ఈనెల 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి 15వ తేదీలోగా విద్యార్థులు తమ వెబ్ ఆప్షన్స్‌లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 7993422489, 9490494532, 8520017815 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. డిగ్రీ చేరాలనుకుంటే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలి. తక్కువ ఫీజుతో అన్ని రకాల సౌకర్యాలతో చదువుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉంటుంది.

– డాక్టర్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోవెలకుంట్ల

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



డిగ్రీ అడ్మిషన్లకు ఉన్నత విద్యాశాఖ ప్రకటన జారీ చేసింది. ఇంటర్, తత్సమాన విద్యార్హత ఉన్న వారు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆర్‌యూ పరిధిలో 14 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రవేశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. అత్యున్నత ప్రమాణాలతో బోధన జరుగుతుంది. అన్ని కళాశాలల్లో జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్స్ ఉన్నాయి. విద్యార్థులు మంచి కళాశాలలను ఎంచుకొని ఉజ్వలమైన ఉన్నత విద్యకు బాటలు వేసుకోవాలి.

– రెక్టార్ ఆచార్య ఎస్.టి.కె.నాయక్, రాయలసీమ విశ్వవిద్యాలయం

క్లుప్తంగా

ఇన్‌చార్జ్ డెమోగా శ్రీనివాసులు శెట్టి



కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఇన్‌చార్జ్ మాస్ మీడియా అధికారి(డెమో)గా శ్రీనివాసులు శెట్టి నియమితులయ్యారు. గత నెల వరకు డెమోగా ప్రమీలాదేవి పనిచేసి పదవీ విరమణ చెందారు. దీంతో పీవోడీటీ విభాగంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా ఉన్న పి. శ్రీనివాసులుశెట్టిని ఇన్‌చార్జ్ డెమోగా నియమించారు.

కోడుమూరు మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌పై ఫోక్సో కేసు

- జిల్లా జైలుకు తరలింపు

కర్నూలు: కోడుమూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్‌పై ఫోక్సో కేసు నమోదైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం ఉదయం కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, రెండవ పట్టణ సీఐ ఇంతియాజ్ ఆధ్వర్యంలో పోలీసులు సుంకేసుల రోడ్డులోని సుధాకర్ సొంత ఇంటి వద్దకు చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో రహస్యంగా విచారించారు. కర్నూలు నుంచి డాక్టర్‌ను తీసుకొనివెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకుని కర్నూలుకు తీసుకొచ్చారు. డీఎస్పీ కార్యాలయంలో సాయంత్రం దాకా విచారించారు. 15 ఏళ్ల బాలిక సుధాకర్ ఇంట్లో నాలుగేళ్లుగా పనిచేస్తోంది. 7వ తరగతి వరకు చదువుకుంది. ప్రస్తుతం ఆమె వయస్సు 19 ఏళ్లు. ఆయన ఆగడాలు భరించలేక ఒక రోజు సెల్‌ఫోన్ కెమెరా ఆన్ చేసి ఉంచానని, తనతో అసభ్యంగా ప్రవర్తించిన వీడియో రికార్డింగ్ ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసి ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎం.సరోజనమ్మ ఎదుట హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించారు. ఈ మేరకు ఆయనను జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.



నల్లమల జంగిల్ ఎకో పార్కు ప్రధాన ద్వారం



జంగిల్ సఫారీ వాహనాలు

ఆనందం.. ఆహ్లాదం

- పర్యాటకులను ఆకర్షిస్తున్న నల్లమల ఎకో టూరిజం పార్క్

శిరివెళ్ల: నంద్యాల–ఒంగోలు రహదారిపై నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్ల వద్ద ఉన్న ఎకో టూరిజం పర్యాటకులను ఆకర్షిస్తోంది. అంతర్రాష్ట్ర పర్యాటకులు అందాలను ఆస్వాదిస్తున్నారు. 2017లో రూ.68 లక్షలు ఖర్చు చేసి అటవీ శాఖ ఆధ్వర్యంలో పచ్చర్ల వద్ద ఎకో టూరిజం పార్కును ప్రారంభించారు. దశల వారీగా పార్కులో పర్యాటకులకు సదుపాయాలను కల్పించారు. కాటేజీల చుట్టూ రంగురంగుల పూల చెట్లతో చూడముచ్చటగా తయారు చేశారు. హైదరాబాద్, బెంగళూరు, చైన్నైతో పాటు ఢిల్లీ నుంచి కూడా అప్పుడప్పుడు పర్యాటకులు వస్తుంటారు. ఆన్‌లైన్ ద్వారా వారు కాటేజీలను బుక్ చేసుకుంటుంటారు.

సరసమైన ప్యాకేజీతో..

పర్యాటకులకు ఫారెస్ట్ అధికారులు ప్యాకేజీ సౌకర్యాన్ని సరసమైన ధరలకే అందిస్తున్నారు. కొత్త కాటేజీలకు రూ.8 వేలు, పాత కాటేజీలకు రూ.6 వేల చొప్పున ధర నిర్ణయించారు. ఇక ఐదేళ్లలోపు పిల్లలకు ఉచితం. 5 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు అదనంగా రూ.1,500 చొప్పున చెల్లించాల్సి ఉంది. ఈ ప్యాకేజీలో కాటేజీ, జంగిల్ సఫారీ, తమకిష్టమైన వంటకాలు ఉన్నాయి. మధ్యాహ్నం 12 గంటలకు పార్కులోకి ప్రవేశం ఉంటుంది. తర్వాత



రెస్టారెంట్

ప్రముఖుల సందర్శన

నల్లమల జంగిల్ ఎకో టూరిజం పార్కును గతంలో పలువురు ప్రముఖులు సందర్శించారు. మాజీ స్పీకర్లు సురేష్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి సిద్దా రాఘువయ్య, ఇతర అటవీ ఉన్నతాధికారులు సందర్శించారు. మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ ఏకంగా 3 రోజుల పాటు కాటేజీలో గడిపారు.

సీజన్ బట్టి టీ గానీ, జ్యూస్ గాని ఇస్తారు. సాయంత్రం 6 గంటలకు స్నాక్స్, టీ సరఫరా చేస్తారు. రాత్రికి వెజ్, నాన్‌వెజ్ సౌకర్యం ఉంటుంది. వెజ్‌లో కాజు కర్రీ, ఆంధ్ర మీల్స్ ఇస్తారు. నాన్ వెజ్‌లో మనిషికి 250 గ్రాముల బాయిలర్ కోడి చికెన్, పుల్కాలు ఇస్తారు. అంతకుముందు 7 గంటలకు



పార్కు అందాలు

ఫైర్ క్యాంప్ ఏర్పాటు చేస్తారు. మరుసటి రోజు ఉదయం 5–6 గంటల మధ్య బెడ్ కాఫీ, 8.30 గంటలకు 3 రకాల టిఫిన్‌లో ఏదో ఒకటి ఇస్తారు. అనంతరం జంగిల్ సఫారీ ఉంటుంది. 3 సఫారీలు అందుబాటులో ఉన్నారు. పార్కుకు 26 కిలో మీటర్ పరిధిలో అడవిను చూపిస్తారు. మధ్యలో దొంగల బావి, దోల్‌బేస్ క్యాంప్, రాగిమాను కుంట, పురాతన దూలాల కుంట రైల్వే ట్రాక్‌ను చూడవచ్చు. వివిధ రకాల అడవి జంతువులు, పక్షులు దూరంగా సంచరించడం చూడవచ్చు. జంగిల్ సఫారీ ముగియగానే ప్యాకేజీ సమయం అయిపోతుంది. కేవలం జంగిల్ సఫారీకి వచ్చేవారైతే ప్యాకేజీకి ఏమి లేదు. ఆరుగురికి రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. జంగిల్ సఫారీ ముగియగానే 10 నిమిషాల పాటు పార్కులోకి అనుమతిస్తారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకే సఫారీ ఉంటుంది. సఫారీ పూర్తి కావడానికి 2 గంటల సమయం పడుతుంది.



రోప్‌వే బ్రిడ్జి

సెల్ ఫోన్ సిగ్నల్స్ ఉండవు..

నల్లమల జంగిల్ ఎకో టూరిజం పార్క్‌లో సెల్ ఫోన్ సిగ్నల్ ఉండవు. అత్యవసరమైతే పర్యాటకుల కోసం పార్కుకు నంద్యాల ఫారెస్ట్ కార్యాలయానికి అనుసంధానంగా వైర్‌లెస్‌సెల్ సెట్ ఉంది. ఫారెస్ట్ ఆఫీస్ సిబ్బంది సెల్ నంబర్ ఆన్‌లైన్‌లో ఉంటుంది. ఆ నెంబర్‌ను పార్క్‌కు వచ్చే ముందు పర్యాటకులు ముందుగానే తమ బంధువులకు ఇవ్వాలి.

అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం



పచ్చర్ల ఎకో టూరిజం జంగిల్ క్యాంప్‌కు వస్తున్న పర్యాటకులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. మొదటి 6 కాటేజీలు ఉండేవి. పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గత నెల మరో 4 కాటేజీలను నిర్మించాం. ఏటా రూ.12 లక్షల ఆదాయం సమకూరుతోంది. కాటేజీ బుకింగ్‌కు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నల్లమలైజంగిల్‌క్యాంప్.కం వెబ్ సైట్ ద్వారా కాటేజీలను బుక్ చేసుకోవచ్చు.

– ఈశ్వర్, రేంజర్

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్స్

వెలుగోడు: వైకల్య ధ్రువీకరణ పత్రాల కోసం నిర్వహించే సదరం స్లాట్ బుకింగ్ శిబిరాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు స్లాట్‌లను విడుదల చేశారు. ఇందుకోసం మీసేవ, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో ముందస్తు స్లాట్లను బుక్ చేసుకోవచ్చు. స్లాట్‌లు బుక్ చేసుకున్న వారికి ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు స్క్రీనింగ్ నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారని వైద్యాధికారి జహీర్ వలి తెలిపారు.


ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు

- బహుళార్థ పశువైద్యశాల డీడీ హేమంత్‌కుమార్

కర్నూలు(అగ్రికల్చర్): ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కర్నూలు కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలు, పిల్లులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌లు ఉచితంగా వేస్తామని డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ వద్ద 1000 డోసుల యాంటీ రేబిస్ వ్యాక్సిన్ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెంపుడు కుక్కల, జీవాల పెంపకందారులకు కుక్కలు, జీవాల ద్వారా సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ..

- స్కూటర్ నుంచి జారిపడి మహిళ మృతి



మృతి చెందిన గౌసియా

ఆలూరు రూరల్: దైవదర్శనానికి వెళ్లొస్తూ స్కూటర్ నుంచి కింద పడి గౌసియా (27) అనే మహిళ మృతిచెందింది. మృతురాలి భర్త బాబ తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు షరీఫ్‌నగర్‌లో నివాసం ఉంటున్న గౌసియా, బాబ దంపతులు రెండు రోజుల క్రితం ఇద్దరు మగ పిల్లలతో కలిసి హొళగుంద మండలం ఎల్లార్తి షాషావలి, షేక్షావలి దర్గాకు వచ్చారు. రెండు రోజుల పాటు దర్గాలో ఉండి మొక్కుబడులు తీర్చుకున్నారు. గురువారం ఉదయం స్కూటర్‌పై కర్నూలుకు బయలుదేరారు. ఆస్పరి మండల కేంద్రం రైల్వే గేటు సమీపంలో గౌసియా స్కూటర్ నుంచి కింద పడింది. ప్రమాదంలో ఆమె తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఆస్పరి పోలీసులు కేసు నమోదు చేసుకుని, గౌసియా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆలూరులో దొంగల హల్‌చల్

- ఒక దొంగను వెంబడించి పట్టుకున్న స్థానికులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లింబోజీ

ఆలూరు రూరల్: పట్టణంలోని స్థానిక ఎల్లార్తి రోడ్డులో ఉన్న మఠ్రి స్వామి మఠం కాలనీలో గురువారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇద్దరు దొంగలు ఉరుకుందమ్మ అనే మహిళ ఇంట్లో చొరబడి హల్‌చల్ చేశారు. ఇంటి బయట వరండాలో నిద్రిస్తున్న ఉరుకుందమ్మ దొంగలను గమనించి ఇరుగుపొరుగు వారికి, పోలీసులకు సమాచారం ఇచ్చింది. స్థానికుల సహాయంతో పోలీసులు వెంబడించి లింబోజీ గంగో చౌహాన్ అనే వ్యక్తిని అదుపులో తీసుకున్నారు. లింబోజి తప్పించుకునే ప్రయత్నంలో కిందపడడంతో పాటు స్థానికులు దేహశుద్ధి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దొంగతనానికి పాల్పడిన తప్పించుకునేందుకు ప్రయత్నించిన లింబోజిని పోలీసులు అదుపులో తీసుకుని స్థానిక ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. అయితే తన ఇంట్లో చొరబడిన దొంగలు రూ.2 లక్షల నగదు, 3 గ్రాముల బంగారు అపహరించినట్లు బాధితురాలు ఉరుకుందమ్మ విలేకరులకు తెలిపారు. దొంగతనం విషయమై ఆలూరు ఎస్‌ఐ ఓబులేసు మాట్లాడుతూ.. లింబోజి అనే వ్యక్తిని స్థానికుల సహాయంతో వెంబడించి పట్టుకున్నామని అతనికి తీవ్రగాయాలు కావడంతో ఆలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని.. పరారీలో ఉన్న మరో వ్యక్తిని గాలిస్తున్నామని చెప్పారు.

ఆగని విధ్వంసం



చిట్యాల రైతు భరోసా కేంద్రం, ప్రాథమికోన్నత పాఠశాలలో శిలాఫకాలను ధ్వంసం చేసిన దృశ్యం

కృష్ణగిరి: టీడీపీ శ్రేణుల విధ్వంసాలు శ్రుతిమించిపోతున్నాయి. బుధవారం రాత్రి చిట్యాల గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ఉన్న శిలాఫలకం, అలాగే మెయిన్ స్కూల్ వద్ద నాడు–నేడు పనుల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. కోయిలకొండ గ్రామంలో బీటీ రహదారి నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకంతోపాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న వైఎస్సార్‌సీపీ జెండా కట్టను కూడా గ్రామ టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఇప్పటికే మండలంలో టి.గోకులపాడు, ఎస్‌హెచ్ ఎర్రగుడి, కృష్ణగిరిలో శిలాఫలకాలతోపాటు వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించిన విషయం తెలిసిందే. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట విధ్వంసాలు సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గెలిచిన పార్టీ గ్రామాల్లో అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందాలి గానీ ఇలా శిలాఫలకాలు ధ్వంసం చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఖండిస్తున్నారు.

టీడీపీ నాయకుల 'చెత్త' రాజకీయం

- గ్రీన్ అంబాసిడర్ల నుంచి చెత్త బండ్లు లాక్కెళ్లిన వైనం



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గ్రామ సర్పంచ్ శేఖర్, గ్రీన్ అంబాసిడర్లు

గడివేముల: పెసరవాయి గ్రామంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. గ్రామ సర్పంచ్ యర్రగుడి శేఖర్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అండదండలతో కొంత మంది కార్యకర్తలు.. గ్రామంలో కొన్నేళ్లుగా గ్రీన్ అంబాసిడర్లుగా మంద సామన్న, అంకగాళ్ల సామన్న, పబ్బడి దావీదు, పెసల ప్రదీప్ ఇళ్ల వద్ద ఉన్న నాలుగు చెత్తను తరలించే బండ్లను దౌర్జన్యంగా తీసుకెళ్లారు. టీడీపీ కార్యకర్తలు రామదాసు, సోనుబాబు, యేసయ్య, గరటయ్యలతో పాటు మరో నలుగురు తమను బెదిరించి చెత్త బండ్లను తీసుకెళ్లారని గ్రీన్ అంబాసిడర్లు సర్పంచ్ శేఖర్‌తో కలసి గురువారం ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు.

పంటలకు రుణ పరిమితి ఖరారు

- బ్యాంకులకు చేరిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నివేదిక
- వరికి గరిష్టంగా రూ.46 వేలు
- మిగిలిన పంటలకూ రుణ పరిమితి పెంపు

నంద్యాల(సెంట్రల్): జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి పంట రుణాల పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖరారైంది. ఈ మేరకు నివేదికలు జిల్లా వ్యాప్తంగా బ్యాంకులకు చేరాయి. పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని గతేడాది డిసెంబర్ లోనే అప్పటి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన టెక్నికల్ కమిటీ సమావేశమై పరిమితిని నిర్ణయించింది. నివేదికను రాష్ట్ర కమిటీకి పంపించగా మార్పులు చేసి ఆమోదించారు. తాజాగా ఆ నివేదికను ఆమోదించారు. లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ రవీంద్ర, జిల్లా సహకార సీఈవో ద్వారా అన్ని బ్యాంకులకూ సమాచారం పంపారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన 4.57 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఖరీఫ్ రుణాలు ఇవ్వడం ప్రారంభించాయి. అలాగే జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన ప్రతి రైతుకూ తన భూమి విస్తీర్ణం మేరకు పంట రుణాలు ఇవ్వాలని లీడ్ బ్యాంకు మేనేజర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న, వేరుశనగ, పత్తి తదితర పంటలకు రుణపరపతి బాగా పెరిగింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రైతులకు, కౌలుదారులకు ఖరీఫ్, రబీకి కలిపి రూ.5366.52 కోట్ల మేర రుణాలు అందించాలని జిల్లా బ్యాంకర్స్ కమిటీ నిర్ణయించింది.

పంట రుణాల పరిమితి వివరాలు ఇలా...

పంట	స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (ఎకరాకు రూపాయల్లో)
వరి	42,000-46000
వరి విత్తనోత్పత్తి	50,000
కంది	19,000-22,000
మినుము	20,000-22,000
శనగ	28,000-32,000
కొర్ర	14,000-15,000
పసుపు	1,00,000-1,10,000
జొన్న	21,000-23,000
మొక్కజొన్న (వర్షాధారం)	26,000-28,000
మొక్కజొన్న (నీటి ఆధారం)	42,000-4,5000
పత్తి	42,000-46,000
మిరప	90,000-95,000
పొగాకు	38,000-42,000
అరటి(టిష్యూకల్చర్)	1,15,000-1,30,000
వేరుశనగ	31,000-35,000
వేరుశనగ(నీటిపారుదల)	35,000-38,000
ఆముదం	18,000-20,000
ఉల్లి	55,000-60,000
మామిడి	45,000-50,000

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు

రైతులకు రుణ పరపతి పెంచిన ప్రకారం రుణాలు అందిస్తున్నాం. సకాలంలో రుణాలు చెల్లించి మళ్లీ తీసుకోవాలి. ప్రతి రైతుకు రుణం అందివ్వాలని బ్యాంకులను ఆదేశించాం.

– రవీంద్ర కుమార్, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్

వంద రోజుల్లో 8,656 గృహ నిర్మాణాల పూర్తి



సిద్దలింగమూర్తి, హౌసింగ్ పీడీ

కర్నూలు(అర్బన్): జిల్లాలో వంద రోజుల్లో 8,656 గృహ నిర్మాణాలను పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేయాలని గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధలింగమూర్తి అన్నారు. గురువారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి జిల్లాలోని ఈఈ, డీఈఈ, ఏఈలతో గూగుల్ మీట్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 17,964 గృహ నిర్మాణాలు వేర్వేరు దశల్లో కొనసాగుతున్నాయన్నారు. ఈ నిర్మాణాలకు సంబంధించి ప్రతి వారం స్టేజ్ కన్వర్షన్ జరగాల్సి ఉందన్నారు. వంద రోజుల కార్యక్రమం పూర్తయిన అనంతరం మార్చి 31 నాటికి మిగిలిన గృహాలన్నింటినీ పూర్తి చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను కూడా విడుదల చేయనున్నారన్నారు. ఆప్షన్ –3 కింద చేపట్టిన గృహ నిర్మాణాలకు సంబంధించి రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. ఆయా కాలనీల్లో ఇసుక, సిమెంట్, స్టీల్ వినియోగానికి సంబంధించిన వివరాలపై పది రోజుల్లోగా స్పష్టత ఇవ్వాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చెల్లింపులను కూడా చేపట్టాలన్నారు. పీఎంఏవై గ్రామీణ్ కింద చేపట్టిన గృహ నిర్మాణాలను కూడా నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

శ్రీశైల మల్లన్న హుండీ ఆదాయం రూ.3.98కోట్లు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని ఉభయ దేవాలయాల హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.3,98,34,583 నగదు లభించినట్లు ఈఓ డి.పెద్ది రాజు తెలిపారు. గురువారం ఆలయంలోని నిత్య కల్యాణ మండపంలో హుండీల లెక్కింపు చేపట్టారు. కాగా ఆలయ హుండీల రాబడిని భక్తులు గత 28 రోజులలో సమర్పించినట్లు ఈఓ వెల్లడించారు. నగదు తోపాటు ఈ హుండీలో 148 గ్రాముల బంగారం, 6 కేజీల 260 గ్రాముల వెండి లభించిందన్నారు. అదేవిధంగా కొంత విదేశీ కరెన్సీ కూడా లెక్కింపులో వచ్చిందన్నారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి రవణమ్మ పాల్గొన్నారు.



కానుకలను లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

బ్యాళ్ల పంపిణీ తూచ్!

- పంచదారలోనూ కోత
- అమలు కాని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు
- బయటి మార్కెట్‌లో కిలో బ్యాళ్లు ధర రూ.180 పైమాటే
- కొనలేక ఇబ్బంది పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు

కర్నూలు(సెంట్రల్): టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ పంపిణీలో సరుకులకు కోత పెట్టింది. బియ్యంతోపాటు బ్యాళ్లు, పంచదార ఇతర నిత్యావసరాలను కచ్చితంగా పేదలకు సరఫరా చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించినా ఆచరణలో మాత్రం సాధ్యం కావడంలేదు. కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. అరకొరగా జొన్నలు ఇవ్వాలని నిర్ణయించినా డీలర్లు వాటిని ఎండీయూలకు అప్పగించడంలేదు. బ్యాళ్లు, పంచదారల కేటాయింపులే జరగలేదు. దీంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు అటు పప్పుకు..ఇటు తీపికి దూరమయ్యారు.

కేటాయింపులు లేవు

జిల్లాలో 6,34,631 మంది రేషన్ కార్డు దారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 1 నుంచి 16వ తేదీల మధ్య 409 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులను సరఫరా చేస్తున్నారు. ఒక్కో కార్డుకు కేజీ కంది పప్పు ఇవ్వాలని స్వయంగా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. అయితే అసలు జిల్లాకు బ్యాళ్ల కేటాయింపే జరగలేదు. జిల్లాకు 600 టన్నులు అవసరం కాగా.. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల బయటి మార్కెట్‌లో వాటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ప్రతి కార్డుకు కేజీ బ్యాళ్లను రూ.67కు సరఫరా చేస్తుంది. బయటిమార్కెట్‌లో బ్యాళ్ల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. కిలో ఏకంగా రూ.180పైగా ధర పలుకుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసే బ్యాళ్లను ఇవ్వకపోవడంతో బయటిమార్కెట్‌లో అధిక రేటుకు కొనుగోలు చేయలేక పేదలు, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఎండీయూ వాహనం ద్వారా బియ్యాన్ని సరఫరా చేస్తున్న దృశ్యం

పంచదార స్టాక్ ఉన్నా ఇవ్వొద్దని మంత్రి ఆదేశం

ప్రతి కార్డుదారుడికి అర్ధకేజీ పంచదారను రూ.17.50కు పౌర సరఫరాల సంస్థ సరఫరా చేస్తోంది. అయితే మంత్రిగా వచ్చిన నాదెండ్ల మనోహర్ పాత సప్లయర్స్ సరఫరాచేసే తూకాల్లో మోసాలు ఉన్నాయని, వాటన్నింటిని బ్లాక్ లిస్టులో పెట్టాలని, కొత్తగా టెండర్లను పిలిచే వరకు ఉన్న స్టాక్‌ను కూడా సరఫరా చేయవద్దని ఆదేశాలు ఇచ్చారు. దీంతో స్టాక్ ఉన్నా పంచదార డీలర్లకు ఇవ్వలేని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు. కాగా, జిల్లాకు దాదాపు 350 టన్నుల పంచదార అవసరం ఉంటుంది.

జొన్నల ఊసేలేదు

ప్రస్తుతం జిల్లాలోని రేషన్‌కార్డుదారులకు కేవలం బియ్యం మాత్రమే ఎండీయూ వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నారు. దాదాపు 10,500 టన్నుల బియ్యాన్ని కేటాయించారు. కాగా 300 టన్నుల జొన్నలను పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక్కో కార్డుకు 2లేదా 3 కేజీలు బియ్యానికి బదులుగా ఎలాంటి డబ్బులు తీసుకోకుండా జొన్నలను వినియోగదారులకు అందించాలి. అయితే డీలర్లు ఎక్కడా జొన్నలను ఎండీయూ ఆపరేటర్లకు సరఫరా చేయడం లేదు. వాటిని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి.

బ్యాళ్లు వేయడం లేదు



రేషన్‌కార్డుదారులకు బియ్యం, జొన్నలు కేటాయించాం. బ్యాళ్లు స్టాక్ లేవు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచదారను కేటాయించలేదు. త్వరలోనే బియ్యంతోపాటు బ్యాళ్లు, పంచదార వచ్చే అవకాశం ఉంది.

– షర్మిల, డీఎం, సివిల్ సప్లయ్ సంస్థ

బియ్యం మాత్రమే వేశారు



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకుల కోసం వెళ్లాను. కేవలం బియ్యం మాత్రమే వేశారు. జొన్నలు కూడా వేయలేదు. బ్యాళ్లు లేవన్నారు. పంచదార ఇవ్వలేదు. అడిగినా లేవని చెప్పారు. ఏమి చేయలేక బియ్యంతో మాత్రమే సరిపెట్టుకున్నాం. – సువాసిని, కృష్ణానగర్, కర్నూలు